క్లుప్తంగా

ఘనంగా పూజలు

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని శ్రీ షిరిడి సాయిబాబా దేవాలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో బాబాకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు అందుకున్నారు.

నేడు సమావేశం

రామాపురం: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం 10గంటలకు మండల అధ్యక్షులు గడికోట విజయలక్ష్మి అధ్యక్షతన సమావేశం జరుగుతుందని ఎంపీడీఓ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. సమావేశానికి మండల శాఖ అధికారులు , గ్రామస్థాయి అధికారులు జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

అసాంఘిక కార్యకలాపాలపై దృష్టి

గాలివీడు: మండలంలో అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్‌ఐ వెంకటప్రసాద్ అన్నారు. బుధవారం నూలివీడు గ్రామంలో ప్రజలతో మమైకమై మాట్లాడారు. ఎన్నికలు సమీపిస్తున్నాయి, ప్రతి ఒక్కరూ ఘర్షణలకు దూరంగా ఉండాలన్నారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు అసాంఘీక కార్యక్రమాలపై నిఘా ఉంచామని తెలిపారు. ఏమైన సమస్యలు ఉంటే శాంతి యుతంగా గ్రామాల్లో పరిష్కరించుకోవాలని, అలాకాని తరుణంగా స్థానిక మండల కేంద్రంలోని పోలీస్‌లదృష్టి తీసుకొస్తే సమస్యలను పరిష్కరించి ప్రజలకు న్యాయం చేస్తామన్నారు. ఆయతనో పాటు ఏఎస్‌ఐ ఆంజిరెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు సన్మానం

ఓబులవారిపల్లె: ఓబులవారిపల్లె మండల తహశీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన శేషగిరిరావును ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డి బుధవారం శాలువతో సన్మానించారు. అనంతరం తహశీల్దర్ శేషగిరిరావు మాట్లాడుతూ మండలంలో విధులు నిర్వహించేందుకు అందరూ సహకరించాలని కోరారు. తదుపరి వత్తలూరు సాయికిషోర్ రెడ్డి మాట్లాడుతూ మండలంలో భూ సమస్యలు, ఆన్‌లైన్ సమస్యలు, సర్వే సమస్యలు ఉన్నాయని, అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. కాగా ఈయన తిరుపతి జిల్లాలో పనిచేస్తూ బదిలీ నిమిత్తం ఓబులవారిపల్లెకు వచ్చారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన తహశీల్దార్ పుల్లారెడ్డి బదిలీ నిమిత్తం కడప కలెక్టరేట్‌కు వెళ్లారు.

పుల్లంపేట ఎంపీడీఓగా నరసింహమూర్తి



పుల్లంపేట: పుల్లంపేట మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ఎస్.నరసింహమూర్తి బాధ్యతలను చేపట్టారు. ఈయన అనంతపురం జిల్లా రాయదుర్గం నియోజకవర్గంలోని గుమ్మగడ్డ ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తూ సార్వత్రిక ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో భాగంగా ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా నరసింహమూర్తి మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించి, మండల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఎన్నికల నిబంధనలు పంచాయతీ కార్యదర్శులు పాటించాలని ఆయన కోరారు.

డీ వార్మింగ్ డేని విజయవంతం చేయండి

రాయచోటి టౌన్ : ఈనెల 9వ తేదిన నిర్వహించే డీ వార్మింగ్ డేని విజయ వంతం చేయాలని జిల్లా విద్యాశాఖ జిల్లా కో ఆర్డినేటర్ ఇంతియాజ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అందుకు సంబంధించిన 8వ 19 ఏళ్ల లోపు విద్యార్థుల వివరాలు సేకరించాలని చెప్పారు. విద్యార్థులకు అల్బెండ్‌జోల్ మాత్రలు వైద్యశాఖ అధికారులకు మీకు అందజేస్తారని చెప్పారు. ఈ మాత్రలు విద్యార్థులు వేసుకోవాలన్నారు. దీనికి అంగీకారంగా విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి రాతమూలకంగా ఒప్పంద తీసుకోవాలని కోరారు. 8వ తేది పూర్తి స్థాయి హాజరు వచ్చే విధంగా చేసి అందుకు తగిన విధంగా మాత్రలు అందాయా లేదా అనే విషయాన్ని ధృవీకరించుకోవాలని సూచించారు.

నులిపురుగుల నిర్మూలనను విజయవంతం చేయాలి

తంబళ్లపల్లె : ప్రభుత్వం చిన్నపిల్లల్లో నులిపురుగుల నివారణ కోసం 9వ తేదీన చేపట్టే డీవార్మింగ్ డేను విజయవంతం చేయాలని స్పెషల్ ఆఫీసర్, జిల్లా అధికారి సందప్ప కోరారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో వైద్య ఆరోగ్య సిబ్బందితో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ మునికుమార్ మాట్లాడుతూ 19 ఏళ్లలోపు పిల్లలకు కడుపులో నులిపురుగుల నివారణకు ఆల్‌బెండోజోల్ మాత్రలు పంపిణీ చేయాలన్నారు. మధ్యాహ్నం భోజనం తరువాత మాత్రలను పిల్లలచే మింగిస్తే జీర్ణ వ్యవస్థ బాగా పని చేసి ఎదుగుదలకు తోడ్పడుతుందన్నారు. అనంతరం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.

కులగణన సర్వే పూర్తి చేయండి

మండలంలో జరుగుతున్న కులగణన సర్వే వేగవంతం చేసి 100 శాతం పూర్తి చేయాలని స్పెషల్ ఆఫీసర్ సందప్ప తెలిపారు. గ్రామ సచివాలయ ఉద్యోగులతో సమీక్ష చేశారు. గ్రామ వలంటీర్ల సహకారంతో ఇంటింటికీ వెళ్లి కులగణన యాప్‌లో పూర్తి సమాచారాన్ని పొందుపరచాలన్నారు. ఎంఈవో త్యాగరాజు, కార్యాలయ ఏవో పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు అందాలి



సచివాలయ సిబ్బందికి విధుల నిర్వహణ పట్ల సూచనలిస్తున్న కమిషనర్ రాంబాబు

రాజంపేట టౌన్: అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షే పథకాలను అందించే బాధ్యత వలంటీర్లు, సచివాలయ సిబ్బందిపై ఉందని మున్సిపల్ కమిషనర్ రాంబాబు తెలిపారు. పట్టణంలోని ఉస్మానగర్-1, 2, ఆర్‌ఎస్ రోడ్డు-1, 2 సచివాలయాలను బుధవారం కమిషనర్ తనిఖీ చేశారు. ఈసందర్భంగా రికార్డులను పరిశీలించారు. సంక్షేమ పథకాల అమలుతీరును సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడం కోసమే సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయాల వ్యవస్థ తీసుకొచ్చారన్నారు. అందువల్ల ప్రజలకు సేవలు అందించడంలో ఎవరు కూడా అలసత్వం వహించరాదన్నారు. విధుల నిర్వహణలో ఎవరైనా అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సచివాల వెల్ఫేర్ అధికారి అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అన్న విషయంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రస్తుతం జగనన్న ఇళ్ళ రిజిస్ట్రేషన్ కార్యక్రమం జరుగుతున్నందున లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా రిజిస్ట్రేషన్ చేయించాలన్నారు. ఇందుకోసం ప్రణాళికను రూపొందించుకొని, లబ్ధిదారులకు టోకెన్ వంటివి ఇచ్చే ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈసందర్భంగా సిబ్బందికి విధినిర్వహణకు సంబంధించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శేషఫణి, ఆర్‌ఐ హరినాధ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల సేవలు అనిర్వచనీయం



ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న ఎస్‌ఐ రమేష్‌బాబు

చిన్నమండెం : వారం రోజుల పాటు ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు చేసిన సేవలు అనిర్వచనీయమని చిన్నమండెం ఎస్‌ఐ రమేష్‌బాబు అభినందించారు. స్థానిక ఆదర్శ పాఠశాలలో బుధవారం జాతీయ సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరం ముగింపు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ సైబర్ నేరాలు, అవాంఛిత ఎస్‌ఎంఎస్‌పై సరైన అవగాహన యువత పొందాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. అనంతరం ప్రతిభ కనపరిచిన ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఎన్‌ఎస్‌ఎస్ పీఓ నవీన్‌కుమార్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన విప్ కొరముట్ల శ్రీనివాసులు



శాసనసభ వద్ద సీఎం జగన్ మోహన్ రెడ్డిని కలిసిన కొరముట్ల, అజయ్ రెడ్డి

ఓబులవారిపల్లె: విజయవాడ శాసనసభ వద్ద ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, రాష్ట్ర స్కిల్ డెవలప్మెంట్ చైర్మన్ కొండూరు అజయ్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గానికి సంబంధించిన విషయాలపై వారు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా వ్యవసాయ మండలి చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి పాల్గొన్నారు.

సచివాలయాలు, పోలింగ్ కేంద్రాల తనిఖీ



సిబ్బంది హాజరును పరిశీలిస్తున్న తహసీల్దారు

సిద్దవటం: మండలంలోని మాచుపల్లి, టక్కోలి గ్రామ సచివాలయాలను, లింగంపల్లి, కడపపాయపల్లి, టక్కోలి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను బుధవారం తనిఖీ చేశామని తహసీల్దారు మురాషావలి తెలిపారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సిద్దవటం మండలంలోని గ్రామ సచివాలయాలను తనిఖీ చేశామని, సిబ్బంది ఆన్‌లైన్ హాజరును, మూమెంటు రిజిస్టర్లను పరిశీలించామన్నారు.లింగంపల్లి లోని పోలింగ్ కేంద్రం , కడపాయపల్లి పోలింగ్ కేంద్రాలను, టక్కోలిలోని రెండు పోలింగ్ కేంద్రాలను పరిశీలించామన్నారు. మండలం లోని అన్నీ పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి.. అన్ని సౌకర్యాలు ఉండేలా చేస్తామని వివరించారు.

ఎన్నికల విధుల్లో జాగ్రత్తలు వహించాలి



మాట్లాడుతున్న ఎలక్ట్రోరల్ అధికారి లీలారాణి

రైల్వేకోడూరు: ఎన్నికల నిర్వహణలో భాగంగా విధులు నిర్వహించే అధికారులు, బీఎల్వోలు నిబంధనలు పాటించే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని కోడూరు ఎలక్ట్రోరల్ అధికారి లీలారాణి గురువారం తెలిపారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో అధికారులతో ఆమె సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణ నిబద్ధతగా నిబంధనలను పాటిస్తూ ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం పలు అంశాలపై అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఆదికారులు పాల్గొన్నారు.

వాలీబాల్ విజేత నందలూరు జెడ్పీహెచ్‌ఎస్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అతిథులు

నందలూరు(రాజంపేట): స్వర్ణాంధ్ర మదర్ ల్యాండ్ విక్టరీ స్కాట్ గ్రూప్ 25వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని అథ్లెటిక్స్‌లో భాగంగా బుధవారం నిర్వహించిన రాజంపేట పార్లమెంట్ స్థాయి వాలీబాల్ పోటీల్లో నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు విజయం సాధించి ప్రథమ, ద్వితీయ బహుమతులను కైవసం చేసుకున్నారు. ముఖ్య అతిథులు విశ్రాంత రైల్వే స్టేషన్ మేనేజర్ ఆనందకుమార్, లయన్ జిల్లా చైర్మన్ అబ్దుల్లా, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు గురుప్రసాద్, విశ్రాంత ఉపాధ్యాయులు వేణుగోపాల్ నాయుడు, లయన్ జి సునీల్ రెడ్డి, సీనియర్ క్రీడాకారుడు పల్లె గ్రీష్మంత్ రెడ్డి, మహేందర్, మోటార్స్ మేనేజర్ హర్ష, మాజీ వార్డు మెంబర్ సుధాకర్‌లు విజేతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో స్వర్ణాంధ్ర సంస్థ అధ్యక్షుడు వేపగుంట శ్యామ్‌రాజ్, రోవర్స్ స్కాట్ లీడర్ అరుణ్ కుమార్, స్కాట్ సభ్యులు ఎస్ జశ్వంత్, నాయనపల్లి సాయి, ప్రకాష్ రాజ్, హరి, రంజిత్, అమృత రాజ్, రాము, హరి, లింగం నరేష్ తదితరులు పాల్గొన్నారు.

మెనూ తప్పనిసరి

లక్కిరెడ్డిపల్లి: మెనూ ప్రకారం పిల్లలకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని అన్నమయ్య జిల్లా శిశు సంక్షేమ శాఖ ఇన్‌చార్జ్ పీడీ శశికళ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎస్సీ బాలసదనాన్ని ఆమె పర్యవేక్షించారు. ఈ సందర్భంగా బాలసదన్‌లోని వంట, నిత్యావసర వసతి గదులను ఆమె పరిశీలించారు. బాలసదనంలో అతి తక్కువ మంది పిల్లలు ఉన్నారని, ప్రతి అంగన్ వాడీ వర్కర్లు పిల్లలను బాలసదనంలో చేర్పించే ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతి ఏటా జూన్, జూలై మాసంలో తల్లిదండ్రులు లేని అనాథ పిల్లలను చేర్పించాలన్నారు. ఉన్న పిల్లలకు మంచి భోజనాలు అందించాలన్నారు. అనంతరం ఐసీడీఎస్ కార్యాలయంలో సూపర్‌వైజర్ అరుణమ్మపై నాగేశ్వరరెడ్డి ఇచ్చిన ఫిర్యాదును పరిశీలించి నివేదికలు ఉన్నతాధికారులకు పంపించినట్లు ఆమె తెలిపారు. అనంతరం అంగన్ వాడీ సూపర్ వైజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లక్కిరెడ్డిపల్లె, రామాపురం, గాలివీడు మండలాలలోని 52 అంగన్ వాడీ కేంద్రాలు నాడు-నేడు క్రింద ఎంపికయ్యాయని, ఆయా పాఠశాలలకు సంబంధించిన వారు బ్యాంక్ అకౌంట్స్ తెరవాలన్నారు. త్వరలో పనులు ప్రారంభించాలని సూపర్ వైజర్లకు సూచించారు. డీసీపీఓ వినోద్, బాలసదనం సూపర్ వైజర్ చెలమ్మ, సూపర్ వైజర్లు దాదిబీ, అరుణమ్మ, సుజాత, హేమలత తదితరులు పాల్గొన్నారు.

దళితవాడ స్మశానవాటికకు స్థలం కేటాయించాలి

రాయచోటి అర్బన్ : మున్సిపల్ పరిధిలోని ఎగువ అబ్బవరం దళితవాడకు స్మశాన స్థలాన్ని వెంటనే కేటాయించాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు యుగంధర్ డిమాండ్ చేశారు. బుధవారం అబ్బవరం హరిజనవాడ వాసులతో కలసి ఆయన జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌కు కలిసి మాట్లాడారు. పట్టణానికి కూతవేటు దూరంలో 150 కుటుంబాలకు పైగా నివసిస్తున్న దళితవాడకు దశాబ్దాలుగా స్మశానవాటిక లేకపోవ దం దారుణమన్నారు. ఎవరైనా చనిపోతే వారిని గౌరవప్రదంగా పూడ్చేందుకు సైతం సరైన స్థలం లేని దయ నీయ పరిస్థితులతో ప్రజలు కొట్టుమిట్టాడుతున్నారన్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి హరిజనవాడ వాసుల సౌకర్యార్థం స్మశాన వాటికకు స్థలం కేటాయించాలంటూ విన్నవించారు.అనంతరం ఈమేరకు జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందచేశారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సిద్దిగాళ్ళ శ్రీనివాసులు, దళితవాడ వాసులు నాగేశ్వర, నరసింహులు, దేవేంద్ర, రాజేంద్ర, మహేష్, రవితేజ పాల్గొన్నారు .

నందలూరు కోర్టులో క్రైమ్ మీటింగ్



నందలూరు కోర్టులో జరిగిన రాజంపేట క్రైంమీటింగ్‌లో మాట్లాడుతున్న జడ్జి కె.లతా

రాజంపేట: నందలూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో బుధవారం రాజంపేట ప్రాంత పోలీసులతో క్రైమ్ మీటింగ్ నిర్వహించారు. జడ్జి కే.లతా అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రధానంగా లోక్ అదాలత్ కార్యక్రమం విజయవంతానికి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. మార్చి 9న జరిగే లోక్ అదాలత్‌లో రాజీకాదగిన క్రిమినల్ కేసులు పరిష్కరించే పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను కోరారు. అలాగే ప్రతిరోజూ జాతీయ లోక్ అదాలత్‌కు సంబంధించి ప్రతిరోజు ప్రీ లోక్ అదాలత్ సిటింగ్స్ నిర్వహించుతామన్నారు. కార్యక్రమంలో ఏపీపీ రెహానారసూల్, రాజంపేట పట్టణ ఎస్‌ఐ మోహన్‌కుమార్‌గౌడ్, చిట్వేలి ఎస్‌ఐ సుధాకర్‌తోపాటు కోర్టు కానిస్టేబుల్స్, రాజంపేట, నందలూరు కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

రేపు అవగాహన

కురబలకోట : రైతుల కలల పంట టమాట సాగుపై మండలంలోని అంగళ్లు భారత్ కల్యాణ మండపంలో శుక్రవారం ఉదయం అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు రీజినల్ ఆఫీసర్ సి.గంగాధరం తెలిపారు. మేలు రకం విత్తనాలు, నార్లు ఎంపిక, మెలకువలు, నాటే విధానం, తెగుళ్లు నివారణ, అధిక దిగుబడి, స్టేకింగ్ విధానం, గ్రేడింగ్, ఎరువుల యాజమాన్యం, నాణ్యమైన కాయల ఉత్పత్తి తదితర విషయాలపై సమగ్ర అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం



తాగునీటికి భూమి పూజ చేస్తున్న డీఈ శ్రీనివాసులురెడ్డి

గాలివీడు : మండల పరిధి గోరాన్‌చెరువు గ్రామం బీసీ కాలనీలో ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి చొరవతో జేజేఎం నిధులు రూ18లక్షల వ్యయంతో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం అవుతోందని ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ శ్రీనివాసులు రెడ్డి అన్నారు. బుధవారం భూమి పూజ చేసి పనులను ప్రారంభించి మాట్లాడారు. బీసీ కాలనీలో ఎన్నో ఏళ్ల నుంచి తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారనే ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో జల జీవన్ మిషన్ ద్వారా నిధులు మంజూరు చేయించి ప్రజలకు తాగునీటి సమస్యలేకుండా ప్రత్యేక చొరవ చూపించారన్నారు. ఇందుకు గోరాన్‌చెరువు గ్రామ ప్రజలు ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ జేఈ ప్రతాప్‌రెడ్డి, సర్పంచ్ దీప్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటాద్రి, బ్రహ్మానందరెడ్డి, దాసరి మధుసూదన్‌రెడ్డి, అన్నారెడ్డి, బీసీ నాయకులు గోపాల్, క్రిష్ణయ్య, లక్ష్మినారాయణ,చంద్ర, శ్రీనివాసులు, బండెన్న, బాలాజీ, రవి, ఆరీఫుల్లా పలువురు వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకులు పాల్గొన్నారు.

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి



మాట్లాడుతున్న విద్యాశాఖ అధికారి2 జయచంద్ర

రామాపురం: మార్చిలో జరగనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు ఇష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలని మండల విద్యాశాఖాధికారి-2 జయచంద్ర అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఆదర్శపాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు పాఠశాల తరపున వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడారు. కష్టపడి చదివే దానికన్నా ఇష్టపడి చదివితే మంచి భవిష్యత్తు ఉంటుందని విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. సమావేశంలో ప్రిన్సిపాల్ ఎస్‌కె.ఎండీ అప్రోచ్‌బేగం, పాఠశాల చైర్మన్ ధర్మారెడ్డి, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వరప్రసాద్ , ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అందరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే సీఎం లక్ష్యం

మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి



జగనన్న సురక్ష కిట్లను అందచేస్తున్న పోలా శ్రీనివాస్‌రెడ్డి

రాజంపేట టౌన్: ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలన్నదే సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరంలో చైర్మన్ పాల్గొని రోగులను ఉద్దేశించి మాట్లాడారు. పేద ప్రజలు ఆర్థిక ఇబ్బందుల కారణంగా వయస్సు రీత్యా వచ్చే ఆరోగ్య సమస్యలను తెలుసుకునేందుకు పరీక్షలను సైతం చేసుకోలేక పోతున్నారన్నారు. అందువల్ల జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా వివిధ రకాల పరీక్షలు నిర్వహించి ఏవైనా ఆరోగ్య సమస్యలు ఉంటే వైద్యం కూడా అందిస్తున్నారన్నారు. జగనన్న సురక్ష పేదలకు వరంలాంటిదని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్యంగా పేద, మధ్యతరగతి ప్రజలు సద్వినియోగం చేసుకొని సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలని ఆకాంక్షించారు. పాదయాత్ర ద్వారా పేదల కష్టాలు తెలుసుకున్నందునే జగన్ సంక్షేమ పథకాల ద్వారా పేదల మోముల్లో చిరునవ్వులు నింపుతున్నారని తెలిపారు. సంక్షేమ పథకాలు ఇలానే కొనసాగి రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే ప్రజలు వచ్చే ఎన్నికల్లో జగన్‌కు మద్దతు ఇచ్చి వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా రోగులకు చైర్మన్ చేతుల మీదుగా జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మర్రి రవి, మున్సిపల్ కమీషనర్ రాంబాబు, జేసీఎస్ పట్టణ ఇన్‌ఛార్జ వడ్డే రమణ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై అధికారులకు సూచనలిస్తున్న మున్సిపల్ కమిషనర్

రాయచోటి అర్బన్ : రాయచోటి మున్సిపల్ పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను బుధవారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు పరిశీలించారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా పోలింగ్ కేంద్రాల్లో అన్ని మౌళిక వసతులను కల్పించాలన్న జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాలను పరిశీలన చేశారు. పట్టణ పరిధిలోని డైట్ హైస్కూల్, బాలికల ఉన్నతపాఠశాల, కె.రామాపురం హైస్కూల్‌లలోని 20 పోలింగ్ కేంద్రాలను మున్సిపల్ ఎఈ క్రిష్టారెడ్డి, ఆర్‌ఐ మల్లిఖార్జునలతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో ఏమాత్రం అలసత్వం వచ్చినా, వసతుల కల్పన విషయంలో అలసత్వం వహించిన మున్సిపల్ ఇంజనీరింగ్, వార్డు ఇంజనీరింగ్ కార్యదర్శులు, బిఎల్‌ఓలపై చర్యలు తప్పవంటూ హెచ్చరించారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ



ముద్రపల్లి పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న తహశీల్దార్

పెనగలూరు (ఓబులవారిపల్లె): మండలంలోని పోలింగ్ బూత్‌లను బుధవారం తహశీల్దార్ మురళీ కృష్ణ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది తనిఖీ చేశారు. మండలంలో 41 కేంద్రాలు ఉండగా 20 బూత్‌లను పరిశీలించారు. బూత్‌లలో కనీస సౌకర్యాలు ఉన్నాయా లేవా..? సౌకర్యాలు లేని బూత్‌లు గురించి విద్యాశాఖ అధికారులతో ప్రత్యేకంగా చర్చించారు. సౌకర్యాలు మెరుగుపరిచేలా చర్యలు తీసుకోవాలని తహశీల్దార్ ఆదేశించారు. నారాయణ నెల్లూరు మొదలుకొని ఈటమాపురం పంచాయతీ వరకు బూత్‌లను వారు పరిశీలించారు. ఆయా బూత్‌లలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో వారు చర్చించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని డెస్కులను వారు పరిశీలించారు. గురువారం మిగిలిన బూత్‌లను పరిశీలించనున్నట్లు వారు తెలిపారు. ఆర్‌ఐ చంద్రమోహన్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ కుమారస్వామి, ఆయా పంచాయతీలలో రెవెన్యూ సిబ్బంది, ఎంఈఓ సుబ్బరాయుడు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి పల్లెబాట



సమావేశంలో మాట్లాడుతున్న సమాజ్‌వాదీ పార్టీ జిల్లా అధ్యక్షుడు భవనాశి వెంకటసుబ్బరాయుడు

సిద్దవటం: సమాజ్ వాదీ పార్టీ ఇన్‌చార్జిలు ప్రజలకు అందుబాటులో ఉండి పార్టీ బలోపేతానికి పల్లెబాట కార్యక్రమాన్ని నిర్వహించాలని సమాజ్‌వాదీ పార్టీ వైఎస్‌ఆర్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు భవనాశి వెంకట సుబ్బారాయుడు పిలుపు నిచ్చారు. సిద్దవటం మండలంలోని కనుమలోపల్లిలోని సమాజ్‌వాదీ పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఉమ్మడి వైఎస్‌ఆర్ జిల్లాలోని ఇంచార్జిలతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు భవనాశి వెంకట సుబ్బరాయుడు మాట్లాడుతూ నియోజక వర్గాల ఇన్‌చార్జులు నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యలపై పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఉపాధ్యక్షులు గజ్జల వెంకటసుబ్బారెడ్డి, డేవిడ్, కార్యదర్శి సుబ్బరాయుడు, కడప ఎంపీ అభ్యర్థి షేక్ ఇమాంబాషా, కడప ఎమ్మెల్యే అభ్యర్థి కొప్పోలి స్వప్న. కమలాపురం ఎమ్మెల్యే అభ్యర్థి బత్తల నాగేశ్వరరావుయాదవ్, మైదుకూరు ఎమ్మెల్యే అభ్యర్థి మీసాల నాగమునెయ్య, ప్రొద్దుటూరు ఎమ్మెల్యే అభ్యర్థి కరింటి పెద్దన్న యాదవ్, జమ్మలమడుగు ఎమ్మెల్యే అభ్యర్థి ఎద్దుల రమేష్, రాయచోటి ఎమ్మెల్యే అభ్యర్థి బి. బాల బసిరెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ షెవెనాజ్, రైల్వే కోడూరు ఎమ్మెల్యే అభ్యర్థి నగిరిపాటి విజయకుమార్, బద్వేల్ ఎమ్మెల్యే అభ్యర్థి భవనాశి వెంకట రమ్యశ్రీ, జిల్లా మహిళా అధ్యక్షురాలు కూశెట్టి వీరలక్ష్మి, ఉపాధ్యక్షురాలు దరియా సునీత పాల్గొన్నారు.

అన్ని సచివాలయాల్లో ఇంటిపట్టాల రిజిస్ట్రేషన్



సచివాలయాల్లో రిజిస్ట్రేషన్‌ల ప్రక్రియను పరిశీలిస్తూ, సూచనలిస్తున్న కమిషనర్

రాయచోటి అర్బన్ : జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మున్సిపల్‌పరిధిలోని అన్ని సచివాలయాల్లో జగనన్న ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ జరుగుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. పట్టణంలోని పలు సచివాయాల్లో జరుగుతున్న రిజిస్ట్రేషన్‌ల ప్రక్రియను బుధవారం ఆయన మున్సిపల్ అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ పరిధిలోని పేదలకు నారాయణరెడ్డిపల్లె లేఔట్‌లో సుమారు 6400 ఇంటి పట్టాలను మంజూరు చేయడం జరిగిందన్నారు. ప్రజలకు రిజిస్ట్రేషన్ ప్రకియ నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా చూసేందుకు వార్డుల వారీగా టోకెన్‌లు జారీచేసి నిర్ణీత సమయంలో రిజిస్ట్రేషన్‌లు చేస్తున్నట్లు తెలిపారు. రాయచోటి సబ్‌రిజిస్ట్రార్ గురుస్వామి ,టెక్నికల్ టీం సహకారంతో త్వరలో వందశాతం పట్టాల రిజిస్ట్రేషన్‌ను పూర్తిచేస్తామని అన్నారు. ఆయా సచివాలయాల్లో రిజిస్ట్రేషన్‌ల ప్రక్రియన ఏర్పాట్లను మున్సిపల్ ఆర్‌ఐ మల్లికార్జున పర్యవేక్షిస్తారన్నారు. మున్సిపల్ ఎఈ క్రిష్టారెడ్డి, ఆర్‌ఐ మల్లిఖార్జున పాల్గొన్నారు.

ఇంటింటికీ ఇంటర్‌నెట్ సౌకర్యం

పీలేరు రూరల్ : ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ ఆదేశాల మేరకు ఇంటింటికీ ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పిస్తామని ఏపీ ఫైబర్‌నెట్ జిల్లా మేనేజర్లు మనోరంజన్‌రెడ్డి, గోవిందరెడ్డి అన్నారు. బుధవారం పీలేరులోని ఎంఎస్ ఆర్ రెసిడెన్సీ ఫంక్షన్ హాల్‌లో ఏపీ ఫైబర్‌నెట్ అపరేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెలకు రూ.190లకే ఇంటర్‌నెట్ సేవలు అందుబాటులోకి తెస్తున్నట్లు తెలిపారు. దీనిపై గ్రామాల్లో అవగాహన కల్పించాలని తెలిపారు. విద్యా రంగంలో సాంకేతిక విద్యకు ప్రాధాన్య పెరిగిందని, విద్యార్థులకు సైతం ప్రభుత్వం ట్యాబులు పంపిణీ చేసి ఆన్‌లైన్ పాఠాలు అందుబాటులో తెచ్చిందన్నారు.